సాక్షి
అనంతపురం
ఆదివారం । 17 । మార్చి । 2024



చీనీ టన్ను రూ.25 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13
అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

ఆదివారం	సోమవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.32	సెహరీ : 5.09



జనహితం.. జగన్ సైన్యం

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమతూకం
- అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో బీసీలకు పెద్దపీట
- రెండు లోక్‌సభ స్థానాలూ వారికే..
- అసెంబ్లీ స్థానాల్లోనూ ముగ్గురు బీసీలకు చోటు
- కదిరిలో మరోసారి మైనార్టీలకు అవకాశం
- రెండు ఎస్సీ రిజర్వుడు స్థానాల్లోనూ నిరుపేదలకు పట్టం
- అనుభవజ్ఞులకూ పెద్దపీట వేసిన జగన్



మాలగుండ్ల శంకర నారాయణ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాజకీయాల్లో సరికొత్త చరిత్రకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారు. నా ఎస్సీ, నా బీసీ, నా మైనార్టీ అని చెప్పడంతో పాటు చేతల్లోనూ సామాజిక న్యాయం చూపించారు. బడుగు, బలహీన వర్గాలను చట్టసభల్లో సగౌరవంగా కూర్చోబెట్టేందుకు తొలి అడుగు వేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసే ఉమ్మడి అనంతపురం జిల్లా అభ్యర్థులను శనివారం వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలనూ బీసీలకే కేటాయించారు. అనంతపురం పార్లమెంట్ స్థానం నుంచి కురుబ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణకు అవకాశం కల్పించారు. అలాగే హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి బోయ సామాజిక వర్గానికి చెందిన జోళదరాశి శాంతమ్మను బరిలోకి దింపుతున్నట్లు ప్రకటించారు.

జయహో బీసీ

సామాజిక సమీకరణాలు, ప్రజల మనోభావాలను బేరీజు వేసుకుని సుదీర్ఘ కసరత్తు అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బీసీలు, ఎస్సీలు, మైనార్టీలకు 50 శాతం సీట్లను కేటాయించి బడుగులకు రాజ్యాధికారం అప్పగించే దిశగా అడుగులు వేసింది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు సీట్లు కలిపి మొత్తం 16 సీట్లు ఉండగా, 8 సీట్లు బీసీ, ఎస్సీ, మైనార్టీలకు కేటాయించింది. తద్వారా ఆయా వర్గాల అభ్యున్నతిపై సీఎం జగన్ తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. అసెంబ్లీ స్థానాల్లో మూడు సీట్లు బీసీలకు కేటాయించారు. అందులో పెనుకొండ నుంచి కేవీ ఉషశ్రీ చరణ్ (కురుబ), కళ్యాణదుర్గం నుంచి తలారి రంగయ్య (బోయ),హిందూపురం నుంచి దీపిక (కురుబ) ఉన్నారు. ఇక రెండు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల(శింగనమల, మడకశిర) నూ నిరుపేదలకు ఇచ్చారు. కదిరి అసెంబ్లీ సీటు 2014 తర్వాత మళ్లీ మైనార్టీలకు కేటాయించారు. మక్బూల్ అహ్మద్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. అన్నింటా అక్కచెల్లెమ్మలకు ప్రాధాన్యం ఇచ్చే వైఎస్ జగన్ ముగ్గురు మహిళలను ఎన్నికల బరిలో నిలిపారు.

పేదలకు పెద్దపీట


రూ.కోట్లు ఇస్తే కానీ సీటు ఇవ్వలేమని టీడీపీ తెగేసి చెబుతుండగా..వైఎస్ జగన్ మాత్రం పేదలంతా నా వాళ్లే అంటున్నారు. అందువల్లే ఈసారి ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో ఇద్దరు నిరుపేదలను ఎన్నికల బరిలో నిలిపి రికార్డు సృష్టించారు. మడకశిర అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ ప్రకటించిన ఈర లక్కప్ప (మాదిగ) నిరుపేద. ప్రస్తుతం రెండు గదుల పక్కా గృహంలో ఉంటున్నారు. అలాంటి వ్యక్తికి జగన్‌మోహన్‌రెడ్డి పిలిచి మరీ టికెట్ ఇవ్వడం విశేషం. శింగనమల అభ్యర్థిగా ప్రకటించిన వీరాంజనేయులు కూడా సాధారణ దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన వారు. ఆస్తులేమీ లేవు.అలాంటి వ్యక్తికి టికెట్ ఇవ్వడంతో జగన్ చిత్తశుద్ధిని అందరూ కొనియాడుతున్నారు.

తొలిసారి అసెంబ్లీ బరిలోకి..

పలువురు వైఎస్సార్ సీపీ అభ్యర్థులు తొలిసారి అసెంబ్లీ బరిలో నిలుస్తున్నారు. గతంలో ఎంపీగా పని చేసిన తలారి రంగయ్య ఈసారి అసెంబ్లీ పోరులో నిలిచారు. అలాగే టీఎన్ దీపిక, వీరాంజనేయులు, ఈర లక్కప్ప, మక్బూల్ అహ్మద్ మొదటి సారి ఎన్నికల బరిలో నిలిచారు.

అనుభవానికి ప్రాధాన్యం

సీట్ల కేటాయింపులో అనుభవానికీ ప్రాధాన్యం ఇచ్చారు. అనంతపురం అర్బన్ నుంచి పోటీ చేస్తున్న అనంత వెంకట్రామిరెడ్డి నాలుగు సార్లు ఎంపీగా పనిచేశారు. 2019లో అసెంబ్లీ బరిలో నిలిచి గెలిచిన ఆయన... తాజాగా రెండోసారి అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. ఇక ఉషశ్రీ చరణ్, దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వంటి అనుభవజ్ఞులకూ మళ్లీ అవకాశం ఇచ్చారు.



అనంతపురం ఎమ్మెల్యే అభ్యర్థులు

1. అనంతపురం అర్బన్ : అనంత వెంకటరామిరెడ్డి
2. రాప్తాడు : తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
3. గుంతకల్లు: యల్లారెడ్డిగారి వెంకటరామిరెడ్డి
4. ఉరవకొండ : యల్లారెడ్డిగారి విశ్వేశ్వరరెడ్డి
5. తాడిపత్రి : కేతిరెడ్డి పెద్దారెడ్డి
6. కళ్యాణదుర్గం: తలారి రంగయ్య
7. రాయదుర్గం: మెట్టు గోవిందరెడ్డి
8. శింగనమల (ఎస్సీ): మన్నెపాకుల వీరాంజనేయులు

శ్రీసత్యసాయి జిల్లా ఎమ్మెల్యే అభ్యర్థులు

9. పెనుకొండ: కేవీ ఉషశ్రీ చరణ్
10. ధర్మవరం : కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
11. పుట్టపర్తి : దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
12. మడకశిర (ఎస్సీ): ఈర లక్కప్ప
13. హిందూపురం: టీఎన్ దీపిక
14. కదిరి : బాపనపల్లి షేక్ మక్బూల్ అహ్మద్

ఎంపీ అభ్యర్థులు

అనంతపురం
మాలగుండ్ల శంకరనారాయణ (కురుబ)

హిందూపురం
జోళదరాశి శాంతమ్మ (బోయ)



జోళదరాశి శాంతమ్మ

ఎంసీసీ పకడ్బందీగా అమలు కావాలి



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ నిదియాదేవి, కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం అర్బన్: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను (ఎంసీసీ) పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శనివారం కలెక్టరేట్ నుంచి ఆర్‌ఓలు, డీఎస్పీలు, ఎస్‌ఎస్టీ, ఎఫ్‌ఎస్టీ, తదితర బృందాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా నియమావళిపాటించాలన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు తొలగించాలని అధికారులను ఆదేశించారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, రోడ్లకు ఇరువైపులా, మీటింగ్ ప్రాంతాల్లో ఉన్న హోర్డింగులను తొలగించాలన్నారు. కార్యాలయాల్లో ఉన్న ఫొటోలు, క్యాలెండర్లు తీసివేయాలని చెప్పారు. ఎన్నికల కోడ్ అధికారులందరికీ వర్తిస్తుందన్నారు. ఈ విషయాన్ని క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. విగ్రహాలను కప్పి వేయాలన్నారు. 1950 కాల్ సెంటర్, టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులపై 24 గంటల్లో నివేదిక ఇవ్వాలన్నారు. వలంటీర్లు రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, కోడ్ అమలులో ఉన్నందున పాల్గొనకూడదని చెప్పారు. ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా పాల్గొంటే చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయ ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఈ విషయాన్ని వలంటీర్లకు తెలియజేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి తదతరులు పాల్గొన్నారు.

'స్పందన' రద్దు

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. తదుపరి జరగబోయే తేదీని ప్రకటిస్తామన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

మోగిన సార్వత్రిక నగారా

- అమలులోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి
- మే 13న పోలింగ్



ఎన్నికల షెడ్యూల్ ఇలా..

- ఏప్రిల్ 18– గెజిట్ నోటిఫికేషన్
- నామినేషన్ల గడువు– ఏప్రిల్ 25
- ఏప్రిల్ 26– నామినేషన్ల పరిశీలన
- ఉపసంహరణ– ఏప్రిల్ 29 వరకూ
- మే 13– పోలింగ్
- జూన్ 4– ఓట్ల లెక్కింపు

ఎన్నికలు జరగనున్న స్థానాలు

- పార్లమెంట్ – 2
- అసెంబ్లీ– 14

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల తేదీలను శనివారం కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు పార్లమెంట్, 14 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. షెడ్యూలు వెలువడటంతో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎన్నికల ప్రవర్తనా నియమావళి) ఉల్లంఘిస్తే అభ్యర్థులు, అధికారులు శిక్షార్హులవుతారు. రాజకీయ నేతలకు సంబంధించిన విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు వారికి సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించనున్నారు.

అభ్యర్థులకు మార్గదర్శకాలు..

షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ పార్టీలు ప్రచారం హోరెత్తించన్నాయి. ఈ క్రమంలో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాల్సిన నియమనిబంధనలను ఎన్నికల సంఘం నిర్దేశించింది. కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నారు.

- అభ్యర్థులు ఎలాంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనకూడదు.
- ఎన్నికల ప్రచారం నిర్వహించే అభ్యర్థులు రాత్రి 10 గంటలకే మైకులు బంద్ చేయాలి.
- ఉదయం 6 గంటల వరకూ మైకుల్లో ప్రచారం చేయకూడదు.
- అభ్యర్థులు పత్రికలకు ఇచ్చే యాడ్స్‌తో పాటు, సోషియల్ మీడియాలోని ప్రకటనలు కూడా ఎన్నికల వ్యయం కిందే పరిగణిస్తారు.
- ఎన్నికల అఫిడవిట్‌లో సోషియల్ మీడియా అకౌంట్లు కూడా పొందుపరచాలి.

జూన్ 6 నాటికి ముగింపు..

ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఆరోజు నుంచి ఏప్రిల్ 25 వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. ఏప్రిల్ 26వ తేదిన నామినేషన్ల పరిశీలన ఉంటుంది. ఏప్రిల్ 29లోగా నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు. అదే రోజున అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. మే 13న పోలింగ్ నిర్వహిస్తారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. జూన్ 6 నాటికి ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది.

నేడు గ్రూప్-1 ప్రిలిమ్స్

- నిర్దేశిత సమయానికి నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

అనంతపురం అర్బన్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష జరగనుంది. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా 33 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 11,587 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు..

పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 08554- 220009 నంబర్‌కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చాన్నారు. పరీక్ష రెండు సెషన్లలో జరుగుతుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండో సెషన్ ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులను గ్రేస్ టైమ్‌తో కలిపి ఉదయం 9.45 గంటల వరకూ, మధ్యాహ్నం1.45 గంటల వరకూ కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. నిర్దేశిత సమయానికి నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించమని కలెక్టర్ స్పష్టం చేశారు. హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదేని గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలన్నారు.

పటిష్ట బందోబస్తు

అనంతపురం: పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. ప్రతి కేంద్రం వద్ద 10 మంది తగ్గకుండా పోలీసులు బందోబస్తు విధుల్లో ఉంటారన్నారు. పోలీసు భద్రత నడుమే ప్రశ్నాపత్రాల బాక్సులను సెంటర్లకు తరలిస్తామన్నారు. కేంద్రంలోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పుస్తకాలను అనుమతించమన్నారు. సెంటర్లకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. ఏవైనా ఇబ్బందులు కలిగితే అభ్యర్థులు వెంటనే దయల్ 100కు లేదా తన ఫోన్ నంబర్ 9440796800కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు

అనంతపురం అర్బన్:'మనసును ప్రశాంతంగా ఉంచుకుని ఆనందంగా పరీక్షలు బాగా రాయండి. ఆల్ ది బెస్ట్' అంటూ కలెక్టర్‌గౌతమి పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 18 నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా సాగేలా అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 142 కేంద్రాల్లో జరగనున్న పరీక్షలకు 40,063 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. విద్యార్థులు ఉదయం 8.40 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుస్తాయని, హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. ఫిర్యాదులు, సందేహాల నివృత్తి, సమాచారం కోసం 9441575778, 9440594773 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు ఈనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయని కలెక్టర్ తెలిపారు.

జగన్‌తోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య. చిత్రంలో పార్టీ నేతలు

అనంతపురం కార్పొరేషన్: తనతోనే సామాజిక న్యాయం సాధ్యమని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి నిరూపించుకున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులతో కలసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.పైలా నరసింహయ్య మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయం పాటించారన్నారు. బడుగులకు రాజ్యాధికారం కల్పించేలా మరింతగా అడుగులు ముందుకు వేశారన్నారు. సామాన్యులకు కూడా ఎమ్మెల్యే అభ్యర్థులుగా అవకాశం కల్పించడం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమన్నారు. శింగనమలలో వీరాంజినేయులు, మడకశిరలో ఈర లక్కప్పకు అవకాశం కల్పించడమే ఇందుకు నిదర్శనమన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులందరూ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. గత ఐదేళ్లు జగనన్న నాయకత్వంలో రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సాగిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి పెద్ద ఎత్తున జరిగిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పాలన తీసుకెళ్లాలన్నారు. ప్రజలు సైతం వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అసంతృప్తులు, ఆశావహులు నిరాశ చెందాల్సిన పనిలేదన్నారు. వైఎస్సార్ సీపీలో ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని, పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, అగ్రీ అడ్వైజరీ బోర్డు కమిటీ చైర్మన్ వెన్నపూస రామచంద్రారెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సైఫుల్లాబేగ్, ఎగ్గుల శ్రీనివాసులు, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు బంగి సుదర్శన్, శ్యాంసుందర్, చంద్రకుమార్, బండి లలిత, తదితరులు పాల్గొన్నారు.

6,850 కేసుల పరిష్కారం

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 6,850 కేసులకు న్యాయమూర్తులు పరిష్కారం చూపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో మొత్తం 24 బెంచ్‌లు నిర్వహించారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులు 1,247, సివిల్ కేసులు 142, ప్రీ లిటిగేషన్ కేసులు, మున్సిపల్ ట్యాక్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు 5,308, మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు 66 పరిష్కరించారు. కక్షిదారులకు రూ.3,81,65,000 అందేలా చర్యలు తీసుకున్నారు. లోక్ అదాలత్‌ల నిర్వహణను జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి దీన పర్యవేక్షించారు.

జేసీ జైలుకెళ్లడం ఖాయం

• సీనియర్ న్యాయవాది శ్రీనివాసులు స్పష్టీకరణ



తాడిపత్రి రూరల్: లారీల కొనుగోలుకు సంబంధించి రూ.50 కోట్ల కుంభకోణంలో ప్రధాన నిందితుడైన మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి త్వరలోనే జైలుకెళ్లడం ఖాయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు, సీనియర్ న్యాయవాది శ్రీనివాసులు స్పష్టం చేశారు. తాడిపత్రిలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అశోక్ లేల్యాండ్ పేరుతో ఇన్‌వాయిస్‌ను జేసీ ప్రభాకర్‌రెడ్డి తన అనుయాయుల ద్వారా రోడ్డు రవాణా అధికారులకు ఇచ్చి మోసం చేశారన్నారు. ఇన్‌వాయిస్‌లో రూ.23,45,319కు జీఎస్టీ రూ.3,04,688 చూపించారన్నారు. 28 శాతం జీఎస్టీ రూ.6,56,689 అయితే దానికన్నా తక్కువ ఎలా చూపిస్తారని ప్రశ్నించారు. అశోక్ లేల్యాండ్ కంపెనీ మాత్రం స్క్రాప్ కింద రూ.6.56 లక్షలకు ఇన్‌వాయిస్ ఇచ్చినట్లు తెలిపిందని, జేసీ వాళ్లు సమర్పించిన పత్రాలు నకిలీవని స్పష్టం చేసిందని చెప్పారు. నకిలీ ఇన్సూరెన్స్ పేపర్ల ద్వారా రూపాయి కూడా కట్టలేదన్నారు. ఒక్కో లారీ రూ.6.56 లక్షలకు స్క్రాప్ కింద 154 వాహనాలను జేసీతో వారి మద్దతుదారులు కొనుగోలు చేశారన్నారు. ఈ స్కాంలో తన ప్రమేయం లేదని ఎస్పీకి జేసీ రాసిచ్చినా.. వాహనాల కుంభకోణంలో దాదాపు 20 కేసుల్లో హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారని తెలిపారు. స్కాంలో సంబంధం లేకుంటే కోర్టు నుంచి ముందస్తు బెయిల్ ఎలా తెచ్చుకున్నారని ప్రశ్నించారు. కోర్టు ఆదేశాల మేరకు తాడిపత్రి విడిచి ఎక్కడికీ వెళ్లరాదన్నా విదేశాలకు వెళ్లారని, తమతో ఆధారాలు కూడా ఉన్నాయని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వీరే

గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గం



పేరు : యల్లారెడ్డి గారి వెంకటరామిరెడ్డి
విద్యార్హతలు : బీఏ (సెయింట్ జోసెఫ్ ఆర్ట్స్ కాలేజ్, బెంగళూరు)
పుట్టిన తేదీ: 29.11.1961
తెలిసిన భాషలు: తెలుగు, కన్నడ, ఇంగ్లిష్, హిందీ
కుటుంబ వివరాలు : భార్య, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె నైరుతి ప్రస్తుతం గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు.
రాజకీయ నేపథ్యం: వై.వెంకటరామిరెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించారు. అనంతరం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ స్థాపించిన తర్వాత పార్టీలో చేరి 2014లో గుంతకల్లు నుంచి వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. 2019లో వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసి 48,500 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఈయన తండ్రి మాజీ ఎమ్మెల్యే దివంగత యల్లారెడ్డి గారి భీమిరెడ్డి. అన్న వై.సీతారామిరెడ్డి టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు, మరో అన్న వై.శివరామిరెడ్డి ఎమ్మెల్సీ, ఇద్దరు తమ్ముళ్లు సాయిప్రసాద్‌రెడ్డి ఆదోని ఎమ్మెల్యే, బాలనాగిరెడ్డి మంత్రాలయం ఎమ్మెల్యేగా ఉన్నారు.
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు: కరోనా సమయంలో దాదాపు 5 నెలల పాటు ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు భోజన సదుపాయం కల్పించారు. గుంతకల్లు, గుత్తి ప్రాంతాల్లో రెండు అంబులెన్స్‌లు ఏర్పాటు చేసి అత్యవసర సమయంలో నిరుపేదలకు సేవలందిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో వైఎస్సార్, వైవీఆర్ పేరిట క్యాంటీన్ ఏర్పాటు చేసి రూ.6లకే భోజన సదుపాయం కల్పించారు.
ఇతర వివరాలు : కష్టాల్లో, ఆపదలో ఉన్న వారికి కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఆర్థిక సహాయం చేస్తుంటారు.

శింగనమల అసెంబ్లీ నియోజకవర్గం



పేరు : మన్నెపాకుల వీరాంజనేయులు
విద్యార్హతలు : ఎం.ఏ (ఎకనామిక్స్)
పుట్టిన తేదీ : 09.06.1987
కుటుంబ వివరాలు : భార్య సీహెచ్ ప్రమీల (రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్), ఒక కుమారుడు.
రాజకీయ నేపథ్యం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి చురుగ్గా పని చేస్తున్నారు. ఈయన తండ్రి వెంకటప్ప శింగనమల మండలం చక్రాయపేట గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, ప్రస్తుతం సింగిల్ విండో డైరెక్టర్.
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు : కరోనా సమయంలో ప్రజలకు తనవంతుగా సేవలందించారు.

తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గం



పేరు : కేతిరెడ్డి పెద్దారెడ్డి
విద్యార్హతలు : 8 వ తరగతి
పుట్టిన తేదీ : 01-08-1964
కుటుంబ వివరాలు : భార్య కె.రమాదేవి, కుమారులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి.
రాజకీయ నేపథ్యం : 1999 సంవత్సరానికి ముందు మండల స్థాయి నాయకుడిగా ఉన్నారు. ఆపై 2006 వరకు యల్లనూరు మండల పరిషత్ అధ్యక్షుడిగా పనిచేశారు. 2018లో తాడిపత్రి నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్తగా నియమితులయ్యారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తాడిపత్రి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు : ఆలయాలు, మసీదుల అభివృద్ధికి విరాళం అందజేశారు. కరోనా సమయంలో తాడిపత్రి ప్రజలకు కూరగాయలను ఉచితంగా పంపిణీ చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మె సమయంలో స్వంత నిధులతో చెత్తను శుభ్రం చేయించారు.

అనంతపురం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గం



పేరు : అనంత వెంకటరామిరెడ్డి
విద్యార్హతలు : ఎంఏ, బీఎల్
కుటుంబ వివరాలు : తల్లిదండ్రులు దివంగత అనంత వెంకటసుబ్బమ్మ, దివంగత అనంత వెంకటరెడ్డి (మాజీ ఎంపీ), సోదరులు అనంత సుబ్బారెడ్డి, అనంత చంద్రారెడ్డి, భార్య అనంత రమ, కుమార్తెలు నందిత, నవ్యత.
పుట్టిన తేదీ – 01-03- 1956
రాజకీయ నేపథ్యం : 1980 నుంచి 1987 వరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా, 1987 నుంచి 1996 వరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 1999 నుంచి 2005 వరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. 1996, 1998, 2004, 2009లో అనంతపురం పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారు. వైఎస్సార్ సీపీ తరపున 2014లో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులుగా పని చేశారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు : కుల, మతాలకతీతంగా చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ఎప్పుడూ ముందుంటారు. దేవాలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి సొంత నిధులు కేటాయించిన సందర్భాలు ఉన్నాయి.
ఇతర వివరాలు : తెలుగు, ఇంగ్లిష్ మాట్లాడతారు.

రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గం



పేరు: తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
విద్యార్హతలు : బీఈ (బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్)
కుటుంబ వివరాలు : తల్లి ప్రేమకుమారి, తండ్రి ఆత్మారామిరెడ్డి. భార్య మనోరమ, కుమారుడు సాయిసిద్ధార్థరెడ్డి, కుమార్తె ఇందిరా ప్రియదర్శిని.
పుట్టిన తేదీ: 06-06-1973
రాజకీయ నేపథ్యం: కళాశాల దశలో ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా పని చేశారు. చదువు పూర్తయిన తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2009 సాధారణ ఎన్నికలలో రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం వైఎస్సార్‌సీపీలో చేరారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా రాప్తాడు నుంచే పోటీ చేసి ఓడిపోయారు. మూడో సారి రాప్తాడు నుంచే 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీచేసి టీడీపీ అభ్యర్థి పరిటాల శ్రీరామ్‌పై గెలిచారు.
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు : కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు రాహుల్ ట్రస్ట్ పేరుతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తర్వాత తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రైతులకు బోర్లు వేయించడం, గొర్రెల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు.
ఇతర వివరాలు : తెలుగు, హిందీ, ఇంగ్లిష్, కన్నడ, తమిళం భాషలు మాట్లాడగలరు.

రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం



పేరు: మెట్టు గోవిందరెడ్డి
విద్యార్హతలు : ఇంటర్మీడియెట్
పుట్టిన తేదీ : 01-07-1953
కుటుంబ వివరాలు: భార్య మెట్టు యశోద, కుమారులు ఎంజీ అమర్‌నాథ్, ఎంజీ విశ్వనాథ్‌రెడ్డి, ఎంజీ కుశాల.
రాజకీయ నేపథ్యం : 2004 నుంచి 2009 వరకు ఎమ్మెల్యేగా, 2011 నుంచి 2017 వరకు ఎమ్మెల్సీగా, 2021 నుంచి 2024 వరకు ఏపీఐఐసీ చైర్మన్‌గా పనిచేశారు.
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు : వెయ్యి మందికి ఉచిత వివాహాలు చేయించారు. ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు విరాళంగా ఇచ్చారు. 44 వేల మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధులు ఇచ్చారు. విద్యార్థుల కోసం మరుగుదొడ్లు నిర్మించారు.
ఇతర వివరాలు : అందరికీ సుపరిచితుడు. మంచి వ్యక్తిగా ముద్ర వేసుకున్నారు.

అనంతపురం పార్లమెంటు నియోజకవర్గం



పేరు : మాలగుండ్ల శంకరనారాయణ
పుట్టిన తేదీ: 01-01-1965
విద్యార్హత : బీఏ, ఎల్ఎల్‌బీ
కుటుంబ వివరాలు : భార్య మాలగుండ్ల జయలక్ష్మి, కుమారుడు మాలగుండ్ల పృథ్వీరాజ్, కుమార్తె నవ్యకీర్తి.
రాజకీయ నేపథ్యం : తండ్రి మాలగుండ్ల వకీలు పెదయ్య ధర్మవరం మున్సిపల్ చైర్మన్‌గా పని చేశారు. ఆయన వారసత్వంతో శంకరనారాయణ రాజకీయాల్లోకి వచ్చారు. 2012 నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులుగా సుదీర్ఘ కాలం పని చేశారు. 2014 నుంచి పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తించారు. 2019లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. మంత్రిగానూ పనిచేశారు.
సేవా కార్యక్రమాలు : కరోనా కష్టకాలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. నిరుపేదలకు సరుకులు పంపిణీ చేయడమే కాక వైద్య సౌకర్యాలు కల్పించారు.

ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గం



పేరు: యల్లారెడ్డి గారి విశ్వేశ్వరరెడ్డి
పుట్టిన తేదీ : 01-05-1959
విద్యార్హతలు : ఎంఏ
కుటుంబ వివరాలు : భార్య వై.భువనేశ్వరి, కుమారుడు వై.ప్రణయ్‌రెడ్డి. ఒక అన్న, ఒక అక్క, ముగ్గురు తమ్ముళ్లు ఉన్నారు.
రాజకీయ నేపథ్యం: విశ్వేశ్వరరెడ్డి తండ్రి దివంగత రాకెట్ల నారాయణరెడ్డి ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు. విశ్వేశ్వరరెడ్డి విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకున్నారు. 1975 నుంచి 2004 వరకూ విద్యార్థి సంఘాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. 2004 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సీపీఎం తరపున ఉరవకొండ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 2009లో కాంగ్రెస్ పార్టీ తరపున ఉరవకొండ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం వైఎస్సార్ సీపీలో చేరి 2014 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లోనూ ఉరవకొండ నుంచే వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేసి ఓడిపోయారు.
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు : శాసనసభ్యుడిగా ఉన్న సమయంలోనే పేదలకు ఇళ్లు ఇవ్వాలని వేలాది మందితో రోడ్డు మీద కూర్చొని ధర్నాలు, వంటావార్పులు చేశారు. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం పలుమార్లు అరెస్టు చేసింది. నియోజకవర్గంలోని భూములకు హంద్రీ-నీవా ద్వారా నీరు అందేలా చొరవ తీసుకున్నారు. పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు.

కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం



పేరు : తలారి రంగయ్య
విద్యార్హతలు : ఎంఏ, ఎంఎల్ఐసీ (ఉస్మానియా యూనివర్సిటీ), పీహెచ్‌డీ (శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ)
పుట్టిన తేదీ : 03-06- 1970
కుటుంబ వివరాలు : తల్లిదండ్రులు తలారి రంగయ్య, వెంకటమ్మ, భార్య తలారి ఉష, పిల్లలు సాయి హర్ష, సాయి శ్రావ్య.
రాజకీయ నేపథ్యం : చేనేత జౌళి శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉద్యోగంలో చేరి, అదే శాఖలో అడిషనల్ డైరెక్టర్‌గా స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. 2017లో రాజకీయాల్లోకి వచ్చారు. 2018లో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అనంతపురం లోక్‌సభ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరపున ఎంపీగా గెలిచారు.
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు : కోవిడ్ సమయంలో అనంతపురం జిల్లాలో ఎంపీ నిధులతో ప్రత్యేకంగా నాలుగు ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేయించారు. మహిళా సాధికారత, జిల్లా వ్యాప్తంగా తాగునీటి బోర్ల తవ్వకం, వీధిలైట్లు, డ్రైనేజీలు, వంతెనలు, శ్మశాన వాటికల నిర్మాణానికి చొరవ చూపారు.
ఇతర వివరాలు : 2009 నుంచి 2012 వరకు వివిధ జిల్లాల్లో డీఆర్‌డీఏ పీడీగా, డ్వామా పీడీగా పనిచేశారు. ఈ సమయంలో మహిళా సాధికారతకు, ప్రజల జీవనోపాధుల మెరుగునకు విశేష కృషి చేసి..తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.

సెల్‌ఫోన్ల రికవరీలో అనంత అగ్రస్థానం

అనంతపురం: పోగొట్టుకున్న, చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీలో దేశంలోనే అనంతపురం జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. రూ.83 లక్షలు విలువ చేసే 311 సెల్‌ఫోన్లను బాధితులకు ఎస్పీ శనివారం అందజేశారు. వీటిలో మిస్ అయినవి 268 కాగా, చోరీకి గురైనవి 43 మొబైల్ ఫోన్‌లు ఉన్నాయి. జిల్లా పోలీస్ సైబర్ విభాగం సీఐ షేక్ జాకీర్, సిబ్బందిని అభినందించడమే కాకుండా సెల్ ఫోన్‌ల రికవరీలో మంచి ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

రబీలో 15 కరువు మండలాలు

అనంతపురం అగ్రికల్చర్: రబీలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున ఉమ్మడి అనంతపురం జిల్లాలో 15 మండలాలను కరువు ప్రాంతాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో అనంతపురం జిల్లాలో 14 (బెళుగుప్ప, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, గుత్తి, కణేకల్లు, పెద్దపప్పూరు, పుట్లూరు, తాడిపత్రి, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, యాడికి, యల్లనూరు, గుంతకల్లు), శ్రీ సత్యసాయి జిల్లాలో ఒకటి (రొద్దం మండలం) ఉన్నాయి.

ఎస్సీ సెల్ కమిటీలో చోటు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీలో పలువురు జిల్లా వాసులకు చోటు దక్కింది. ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్‌గా జింకల రామాంజినేయులు, ప్రధాన కార్యదర్శులుగా పెన్నోబులేసు, దార్ల పురుషోత్తం, లింగాల రమేష్ బాబు, కార్యదర్శులుగా బంగి సుదర్శన్, తప్పెట వెంకటనారాయణ, తలరమ్ల శ్యాం సుందర్ మూర్తి నియమితులయ్యారు.

వాణిజ్య విభాగం: వైఎస్సార్‌సీపీ అనుబంధ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నూకల పట్టాభిరామ సుబ్బయ్య గుప్తా, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె.హనుమంతరెడ్డి, సహాయ కార్యదర్శిగా జి.చంద్రశేఖర్ యాదవ్ నియమితులయ్యారు.

నెరవేరిన దశాబ్దాల కల



శింగనమల చెరువు మరువకొమ్మ వద్ద పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

- సీఎం జగన్ చొరవతో శింగనమల చెరువు లోకలైజేషన్
- మరువకొమ్మ వద్ద పైలాన్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే పద్మావతి

శింగనమల: శింగనమల రంగరాయల చెరువును లోకలైజేషన్ చేయాలన్న ప్రజల దశాబ్దాల కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటారని పేర్కొన్నారు. చెరువు లోకలైజేషన్‌ను పురస్కరించుకొని మరువకొమ్మ వద్ద ఏర్పాటు చేసిన పైలాన్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. చెరువులో గంగపూజ నిర్వహించి.. చెరువు కింద పంటలు పండి, రైతులు, కూలీలు, మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎందరో ముఖ్యమంత్రులు, ఎన్నో ప్రభుత్వాలు మారినా శింగనమల చెరువు లోకలైజేషన్ ఎన్నికల హామీగానే మిగిలిపోయిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నాలుగేళ్లు వరుసగా హెచ్చెల్సీ ద్వారా చెరువుకు నీరు విడిపించి రైతులను ఆదుకున్నారన్నారు. ఆ తర్వాత ఎన్నికల సమయంలో తాను గెలిస్తే చెరువును లోకలైజేషన్ చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి చెరువును లోకలైజేషన్ చేశారన్నారు. దీంతో ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందన్నారు. చెరువు కింద పంటలు పండాయన్నారు. చెరువులో నీరు ఉండడం వల్ల 300 మంది మత్స్యకారులు చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని 45 చెరువులను లోకలైజేషన్ చేయించినట్లు తెలిపారు.

తమ్ముడు వీరాంజనేయులును గెలిపించండి

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మా తమ్ముడు వీరాంజనేయులును గెలిపించాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాటక అకాడమి చైర్ పర్సన్ సీహెచ్ ప్రమీల, డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, సర్పంచ్‌లు సరోజమ్మ, పార్వతమ్మ, వైస్ ఎంపీపీ విజయ, మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీత, వైస్ చైర్‌పర్సన్ మూడ్ గీత, రాష్ట్ర మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి లలిత కళ్యాణి, ఎంసీఎస్ డైరెక్టర్ జయసుధ, వైఎస్సార్‌సీపీ నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెన్నకేశవులు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఎస్వీ నారాయణ, మండల కన్వీనర్ చిక్కాల బాలకృష్ణ, యూత్ విభాగం మండల అధ్యక్షులు బెస్త ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనంత చిన్నారికి గవర్నర్ ప్రశంస


ఆద్యలక్ష్మిని అభినందిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన మూడున్నర ఏళ్ల చిన్నారి ఆద్యలక్ష్మి శాస్త్రీయ నృత్యానికి ముగ్ధుడైన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రత్యేకంగా పిలిపించుకుని అభినందించారు. నగరానికి చెందిన అరవింద నృత్య శిక్షణాలయంలో శాస్త్రీయ నృత్యం నేర్చుకుంటూ ఇటీవల తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అరంగేట్రంతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ నృత్యాన్ని వీడియోల ద్వారా తిలకించిన గవర్నర్ నజీర్ అహమద్ చిన్నారి ఆద్యలక్ష్మికి రాజభవన్‌లో శాస్త్రీయ నాట్యం చేసే అవకాశం కల్పించారు. నృత్యాన్ని తిలకించిన గవర్నర్ చిన్నారిని అభినందించారు. త్వరలో తానా సభలకు దేశం తరఫున వెళ్లే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టండి


చిన్మయనగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

రాప్తాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని ఎంపీపీ బోయ రామాంజనేయులు, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ కోరారు. శనివారం మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలో చిన్మయ నగర్‌లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజల ఇల్ల వద్దకు వెళ్లి పథకాల గురించి వివరించారు. రాష్ట్రంలో జగనన్నను, రాప్తాడు నియోజకవర్గంలో తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, ఉషా రాణి, భాగ్యమ్మ, వెంకట రెడ్డి, రమణా రెడ్డి, చెన్నారెడ్డి, ఎల్ఐసీ వెంకట్రాముడు, ప్రదీప్, బోయ మనోహర్, సాంబ శివారెడ్డి, ఉమేష్ పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయాలి


ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ నిదియా

అనంతపురం సిటీ: విధి నిర్వహణలో మరింత బాధ్యతగా పని చేయాలని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. ఉమ్మడి జిల్లాలోని జెడ్పీ యాజమాన్యం పరిధిలో పని చేస్తున్న ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన ఇబ్రహీం ఫయాజ్–బెళుగుప్ప, నూర్జహాన్–శెట్టూరు, రమాదేవి–రొద్దం, శ్రీనివాసులు–అనంతపురం జెడ్పీ, శాంతి–వజ్రకరూరుకు జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవితో కలసి శనివారం ఉదయం నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు లెక్కల శ్రీనివాసులు, నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తాం


ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ శ్రేణులు


ఎమ్మెల్యే అనంత ఇంటి వద్ద కార్యకర్తల సంబరాలు

- పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తా
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- టికెట్ కేటాయించడంతో మిన్నంటిన సంబరాలు

అనంతపురం కార్పొరేషన్: కోవిడ్‌తో రెండేళ్లు గడిచిపోయినా.. మిగతా రెండున్నరేళ్లలో నియోజకవర్గంలో రూ.1,045 కోట్లతో అభివృద్ధి, రూ.2,305 కోట్లతో సంక్షేమాన్ని అందించాం. గత టీడీపీ ప్రభుత్వం కంటే భిన్నంగా నగర ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవించే చర్యలు తీసుకున్నాం. ప్రజలకు మేము చేసిన మేలుతో పాటు భవిష్యత్తుకు ఢోకా లేదని నిరూపించాం. రానున్న ఎన్నికల్లో విజయ దుందుభి మోగిస్తామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ అనంతపురం అర్బన్ నియోజకవర్గ అభ్యర్థిగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని ప్రకటించడంతో శనివారం ఆయన నివాసం వద్ద సంబరాలు మిన్నంటాయి. పార్టీ శ్రేణులు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చిన ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. స్వీటు పంచిపెట్టి, బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ప్రచార రథంలో జై జగన్..జై అనంత అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

రెండో సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే అనంత కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో నూతన ఒరవడులకు శ్రీకారం చుట్టారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను 99.99 శాతం అమలు చేశారని కొనియాడారు. గత ప్రభుత్వాలు హామీలు గుప్పించినా.. 50 శాతం కూడా చేయలేక పోయాయన్నారు. జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుంటామని ప్రజలు చెబుతున్నారన్నారు. అనంతపురం నియోజకవర్గం చరిత్రలో లేని విధంగా మిన్నగా సంక్షేమం, అభివృద్ధి అందించినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో అనంతపురంలో పరిశ్రమ తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. తద్వారా యువతకు ఉపాధి కల్పిస్తామని వెల్లడించారు. అదే విధంగా రానున్న రోజుల్లో మరికొన్ని రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రశాంతతకు మారుపేరుగా మార్చాం

బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడి ప్రభుత్వంలో వచ్చిన టీడీపీ (2014–19) జిల్లా కేంద్రంలో అలజడి వాతావరణం సృష్టించిందన్నారు. టీడీపీ నాయకులు తీరుతో వ్యాపారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లా కేంద్రాన్ని ప్రశాంతతకు మారుపేరుగా మార్చామన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైపుల్లాబేగ్, శ్రీదేవి, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రామయ్య, దాదు, భూమిరెడ్డి జాహ్నవి, పార్వతి, సుహాసిని, సుజాత రెడ్డి, భానుమతి, కార్పొరేటర్ సాకే చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకర నారాయణ

అనంతపురం కార్పొరేషన్: సంక్షేమం, అభివృద్ధే పరమావధిగా సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగించారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని 22వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త మాలగుండ్ల శంకర నారాయణతో కలసి సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాలగుండ్ల శంకర నారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోసారి అవకాశం ఇస్తే రెట్టింపు సంక్షేమం, అభివృద్ధి చేసి చూపుతామన్నారు. ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకర నారాయణ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడం జరిగిందన్నారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్లు లీలావతి, ఇసాక్, సంపంగి రామాంజినేయులు, బాలాంజినేయులు, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, అబూసలేహ, సాకే చంద్రలేఖ, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్ర రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైపుల్లాబేగ్, శ్రీదేవి, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రామయ్య, జానీ, వనారస బలరాం, జావెద్, దాదా ఖలందర్, సత్యనారాయణ, రమేష్, కుళ్లాయస్వామి, పార్వతి, భారతి, ఉష, సుహాసిని, సుజాత రెడ్డి, కార్పొరేటర్ సాకే చంద్ర తదితరులు పాల్గొన్నారు.


మహిళా సమాఖ్య యూనిట్లకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలు మాఫీ చేయడమే కాకుండా మహిళలు పారిశ్రామికత్తలుగా ఎదిగేందుకు చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే నివాసం వద్ద నగరంలోని 93 మంది స్వయం సహాయ సంఘం మహిళలకు స్లం స్థాయి సమృద్ధి యూనిట్ల ఏర్పాటుకు మంజూరైన రూ.46.50 లక్షల చెక్కును అందజేశారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు లీలావతి, చంద్రలేఖ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరా

అనంతపురం అర్బన్: జిల్లాలో ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డికి కలెక్టర్ గౌతమి తెలిపారు. నీటి సరఫరాకు సంబంధించి సీపీడబ్ల్యూఎస్ (కాంప్రెహెన్సివ్ ప్రొటెక్టెడ్ వాటర్ సప్లై స్కీమ్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు (ఓఅండ్ఎం) సంబంధించి జిల్లా పరిషత్ నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకునేలా పీ అండ్ ఆర్‌డీ నుంచి అనుమతి ఇవ్వాలని సీఎస్‌ను కలెక్టర్ కోరారు. తాగునీటి సరఫరా, ప్రవర్తనా నియమావళి, గ్రూప్–1 పరీక్ష, తదితర అంశాలపై సీఎస్ శనివారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమి, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరాపై సీఎస్‌కు కలెక్టర్ వివరించారు. గుంతకల్లు మండలం మొలకలపెంట, వెంకటాంపల్లి, గురప్పాడు గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేపట్టామన్నారు. పీఏబీఆర్ డ్యామ్‌లో ప్రస్తుతం 1.50 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ఇక్కడి నుంచి కళ్యాణదుర్గం, శ్రీ సత్యసాయి జిల్లాలోని హిందూపురం, మడకశిర, తదితర ప్రాంతాలకు తాగునీటి సరఫరా అవుతోందన్నారు. మూడు నెలలు జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతోనే వర్సిటీ పురోగతి

అనంతపురం: ఉద్యోగుల సమిష్టి సహకారంతోనే వర్సిటీ పురోగతి సాధ్యమని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ (ఆప్కాస్) ఉద్యోగుల ఆధ్వర్యంలో వీసీకి ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. స్నేహ పూర్వక వాతావరణంలో ఉద్యోగులు పనిచేస్తే సత్ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, జేఎన్‌టీయూఏ ఆప్కాస్ ఉద్యోగులు సంఘం అసోసియేషన్ ప్రసిడెంట్ ఓబుగారి శిరీష్ రెడ్డి, సెక్రెటరీ డి. వెంకట రాముడు, ట్రెజరర్ డి.రహంతుల్లా, వైస్ ప్రెసిడెంట్ యం. క్రిష్టయ్య, జాయింట్ సెక్రెటరీ ఏ.సాయినాథ్, కన్వీనర్ జి.దివాకర్, ఈసీ మెంటర్లు పాల్గొన్నారు.

రాప్తాడులో విజయం నాదే

- భారీ మెజార్టీతో చరిత్ర సృష్టిస్తాం
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: 'రాప్తాడులో విజయం నాదే' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దీమా వ్యక్తం చేశారు. శనివారం వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ అభ్యర్థిగా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ.. పరిటాల సునీత ఇచ్చిన అనేక హామీలు నియోజకవర్గ చరిత్రలో కలిసిపోతే.. వాటిని నిజం చేసి చూపించినట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు తనను భారీ మెజార్టీతో గెలిపిస్తారని వెల్లడించారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో రాప్తాడులో మళ్లీ బరిలో నిలుస్తున్నానని పేర్కొన్నారు. పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చి, రామగిరిలో వేలాదిమంది పేద రైతులకు ఉచిత బోర్లు వేయించినట్లు తెలిపారు. మహిళలకు ఉపాధి కల్పించేందుకు గార్మెంట్స్ పరిశ్రమల ఏర్పాటుకు భూములు కేటాయించామన్నారు. 10 వేల మంది మహిళా పాడి రైతుల కోసం అమ్మ డెయిరీ ఏర్పాటు చేశామని వెల్లడించారు. 17 వేల ఇళ్లు మంజూరు చేయగా.. 20 వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చామన్నారు. మరో 10 వేల ఇళ్లకు డీపీఆర్ మంజూరైందని గుర్తు చేశారు. డీబీటీ, నాన్ డీబీటీ కింద నియోజకవర్గంలో రూ.3 వేల కోట్లను ప్రజలకు పంపిణీ చేశామన్నారు. నియోజకవర్గంలో ప్రతి చెరువుకూ నీరు ఇచ్చామన్నారు. చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా చెరువులకు నీరందించి, మరువ పారించామన్నారు. రూ.117 కోట్లతో 110 గ్రామాలకు పీఏబీఆర్ నీరు తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి 48 గ్రామాలకు నీరు తీసుకొస్తున్నామన్నారు. రోడ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నట్లు గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన రోడ్ల పనుల టెండర్లను దక్కించుకున్న పరిటాల కుటుంబం, బంధువులు ఆ పనులు జరగకుండా అడ్డుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో సాగు, తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు మూడు రిజర్వాయర్లను మంజూరు చేయించుకున్నామని తెలిపారు.

గార్మెంట్స్ పరిశ్రమతో ఉపాధి

రామగిరి మండలంలో 1,500 కోట్లతో 300 మెగావాట్ల సోలార్ హైబ్రిడ్ పవర్ ప్లాంటు తీసుకొచ్చాన్నారు. కనగానపల్లి మండలంలో రూ.5 వేల కోట్లతో 1,050 మెగావాట్ల సోలార్ ఉత్పత్తి కేంద్రాన్ని తెరిపిస్తున్నామన్నారు. గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల నియోజకవర్గంలో వేలాది మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రూపురేఖలు మారబోతున్నాయన్నారు. వేల కుటుంబాలను బతికించడానికి మళ్లీ జగనన్న రావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తానని దీమా వ్యక్తం చేశారు.

గ్రామాలకు రహదారి సౌకర్యం


గొల్లవాండ్లపల్లిలో రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండలంలోని గ్రామాలకు తారు రోడ్లు వేయించి, రహదారి సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని నామాల గ్రామం నుంచి గొల్లవాండ్లపల్లి గ్రామాల మధ్య తారు రోడ్డుకు, వెంకటంపల్లి ఒంటికొండ గ్రామాల మధ్య ఉన్న కోతిగుట్ట వద్ద నుంచి ఆమిదాలకుంట వరకూ దాదాపు ఏడున్నర కిలోమీటర్ల తారు రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అంతకుముందు బసంపల్లిలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పూలవర్షం కురిపించి సాదరంగా స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో రోడ్లు వేయించేందుకు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజిలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు డోలా రామచంద్రారెడ్డి, మేడాపురం, ఓబుళంపల్లి, వెంకటంపల్లి సర్పంచులు రామాంజనేయులు, చెన్నారెడ్డి, జయచంద్రారెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, మేడాపురం సూరి, ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, మాడెం ప్రకాష్‌రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, నారాయణ స్వామి, రామకృష్ణారెడ్డి, నామాల శీన, రామకృష్ణ, సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకాష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం


పైప్‌లైన్ పనులకు భూమిపూజ చేస్తున్న తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసి సస్యశ్యామలం చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న ఎమ్మెల్యేను రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంతో మంది రైతులకు ఉచితంగా బోర్లు వేయించారన్నారు. దశాబ్దాలుగా ఉన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. రూ.117 కోట్లతో పీఏబీఆర్ డ్యాం ద్వారా ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు శాశ్వతంగా నీటి సమస్యకు పరిష్కారం చూపారని కొనియాడారు. రోజుకు 16 గంటలు నీరు అందేలా కృషి చేశారు. ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తయినట్లు వెల్లడించారు. అనంతరం తోపుదుర్తి గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, కన్వీనర్ లక్ష్మినరసింహులు,యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్, ఎంపీటీసీ పోతులయ్య,తోపుదుర్తి సర్పంచ్ ఓబులేష్,నాయకులు పెద్ద కొండారెడ్డి, వాసుదేవరెడ్డి,అమర్‌నాథ్‌రెడ్డి, సద్దికూటి శివారెడ్డి, అంజినప్ప, తరుణ్, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఓబీ టైలర్ వెంకటేష్, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయండి

అనంతపురం మెడికల్: అంకితభావంతో పనిచేసి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవి కుమార్ సిబ్బందికి సూచించారు. శనివారం డీసీహెచ్ఎస్ కార్యాలయంలో గతంలో నోటిఫికేషన్ విడుదల చేసిన కొన్ని పోస్టులకు మూడవ కౌన్సిలింగ్ నిర్వహించారు. అందులో 15 మందికి వివిధ కేటగిరీల్లో నియామక పత్రాలను అందజేశారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం


పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ అన్బురాజన్


పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం: ఆంధ్ర రాష్ట్ర సాధనకు ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అన్నారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శనివారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్. విజయభాస్కర్ రెడ్డి, జి. రామకృష్ణ, ఎస్. లక్ష్మీ నారాయణ రెడ్డి, ఆర్ఐ రాముడు, ఏఓ శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులు నాయుడు, తేజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు నివాళి అర్పించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, వర్సిటీ ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, ప్రొఫెసర్ వి. సుమలత, ప్రొఫెసర్ బి.ఈశ్వర్ రెడ్డి, ప్రొఫెసర్ జీవీ సుబ్బా రెడ్డి, ప్రొఫెసర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. కృష్ణ కుమారి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ కే.పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్: అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ముందుకెళ్దామని మేయర్ వసీం పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని శనివారం నగరపాలక సంస్థ ఆవరణంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి మేయర్ వసీం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, మేనేజర్ లక్ష్మిదేవి, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొట్టిశ్రీరాములు జయంతి కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం ఫలితంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ జరిగిందన్నారు. అమరజీవిని ఆదర్శంగా తీసుకుని, ఆయన స్ఫూర్తితో అందరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, బీసీ సంక్షేమాధికారి కుష్బూ కొఠారి, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, చేనేత జౌళి శాఖ అధికారి బసవరాజు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరిశోధనలపై దృష్టి సారించాలి

అనంతపురం: సమాజ హిత పరిశోధనలపై దృష్టి సారించాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు అన్నారు. శనివారం జేఎన్‌టీయూ అనంతపురం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో రీసెర్చ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ప్రతి మూడు నెలలకోసారి రీసెర్చ్ రివ్యూ నిర్వహించాలన్నారు. ప్రతి విభాగంలోనూ కమిటీలను ఏర్పాటు చేశామని, వారి ఆధ్వర్యంలో రివ్యూ కొనసాగాలని కోరారు. కార్యక్రమంలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఈశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.మమత పాల్గొన్నారు.

గేట్ ఫలితాల్లో శ్రీచరణ్ ప్రతిభ

అనంతపురం: అఖిల భారత స్థాయిలో నిర్వహిస్తున్న గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్) ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఇందులో అనంతపురం శ్రీనగర్ కాలనీకి చెందిన ఆకుల శ్రీచరణ్‌కు 359వ ర్యాంకు దక్కించుకుని ప్రతిభ చాటాడు. శ్రీచరణ్ తండ్రి డాక్టర్ ఏవీ రత్న కుమార్ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా బుక్కరాయసముద్రంలో పనిచేస్తున్నారు. తల్లి రాధాదేవి గృహిణి. మెకానికల్ ఇంజినీరింగ్‌లో 'గేట్' రాసిన శ్రీచరణ్ 747 మార్కులు సాధించాడు.

శ్రీచైతన్య విద్యార్థుల సత్తా

అనంతపురం ఎడ్యుకేషన్: ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్ (ఐఎన్‌టీఎస్ఓ) రెండోలెవల్ పరీక్ష ఫలితాల్లో అనంతపురం జోన్ శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారని ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం కమ్మభవన్ సమీపంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం సీ, ఎం బ్యాచ్ క్యాంపస్‌లో విద్యార్థుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఐఎన్‌టీఎస్ఓ రెండో దశ ఫలితాల్లో అనంతపురం నగరానికి చెందిన బి. నవదీప్, టి.చరిత, పూర్వజ్ రామ్, కళ్యాణదుర్గం మనస్విని గ్రాండ్ ప్రైజ్ కింద ల్యాప్‌టాప్‌లు దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు విశ్వనాథ్, షమీనా ఖాన్, తబసుమ్, వెంకటేష్, ఖలందర్, శాంత, పర్వీన్ భాను, నేత్రావతి, ఇర్షాద్, శ్రీదేవి, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, శ్రీనివాస్, నాగభూషణ్, డీన్లు పాల్గొన్నారు.

24న ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్

అనంతపురం: అనంతపురంలోని కనకదాస కళ్యాణ మండపం వేదికగా ఈనెల 24న రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్–2024 నిర్వహిస్తున్నట్లు ఏ1 చెస్ అకాడమీ ప్రతినిధి అమ్మినేని ఉదయ్ కుమార్ నాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ నరసింహా రెడ్డి శనివారం విడుదల చేశారు. వివిధ కేటగిరిల్లో ప్రతిభ చాటిన 20 మంది క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు. మొత్తం రూ.లక్ష నగదు బహుమతిని అందజేస్తామన్నారు. అదే విధంగా భీమవరంలో జూన్ 4 నుంచి 9 వరకూ జరిగే ఇంటర్నేషనల్ ఫిడే ఓపెన్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి అర్హత సాధిస్తారన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ కోఆర్డినేటర్ గోవింద రాజులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం

అనంతపురం అర్బన్: శ్రీశ్రీ అనంత కైవార యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని సమితి గౌరవాధ్యక్షుడు రమణ ప్రారంభించి, మాట్లాడారు. కలెక్టరేట్‌కు వివిధ పనులపై ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారన్నారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. సమితి అధ్యక్షుడు శేషాద్రి, కార్యదర్శి శ్రీరాములు, సభ్యులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

అనంతపురం మెడికల్: జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల్లో రోగులకు అందించే వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో తప్పక నమోదు చేయాలని ఆరోగ్యశాఖ సిబ్బందికి పీఓడీటీ డాక్టర్ సుజాత ఆదేశించారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో హెచ్ఎంఎస్ పోర్టల్‌పై సిబ్బందితో సమావేశమయ్యారు. కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో రోగుల వివరాలను నమోదు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో స్టాటిస్టికల్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, డిప్యూటీ ఎస్ఓ నాగేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి అండగా ఉంటాం

ఆత్మకూరు: ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి పనులు, సేవా కార్యక్రమాలు చేపట్టారని కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పార్వతమ్మ తెలిపారు. శనివారం ఆత్మకూరులోని కనకదాస కల్యాణ మండపం వద్ద ఆరుబయట ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సొంత నిధులతో వేసిన ప్లాట్‌ఫారమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లన్న, శ్రీరాములు, రాజశేఖర్,పెదయ్య,నారాయణప్ప, శీనయ్య పెదయ్య, ఆదెప్ప, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం బసవతారకనగర్, వీకే నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో రెండు బోర్లు వేసి దాదాపు 1500 మీటర్ల మేరకు పైపులైను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి బసవతారక నగర్, వీకే నగర్ కాలనీల ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం రూ. 7 లక్షలు ఖర్చు చేశారు. పైపులైన్ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి అశోక్ బాబు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష పుష్పార్చన

అనంతపురం కల్చరల్: మంత్రాలయ రాఘవేంద్ర స్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని గత నాలుగు రోజులుగా వైభవంగా సాగుతున్న గురు వైభవోత్సవం, పట్టాభిషేక మహోత్సవాలు శనివారం ముగిశాయి. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు (ఎండోమెంట్) జ్వాలాపురం శ్రీకాంత్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వీరిని నిర్వాహకులు స్వామి శేషవస్త్రాలతో సత్కరించారు. దేవరకొండ కౌసల్య శిష్యబృందాలు కోలాటంతో ఆకట్టుకున్నారు.